## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, జనవరి 29 : గ్రీవెన్స్‌లో బాధితులు సమర్పించే అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రీవెన్స్ డేలో కలెక్టర్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. పరిష్కార స్వభావం కలిగిన భూ సమస్యలను కలెక్టర్ సత్వరమే పరిష్కరించారు. పెనుబల్లి, కూసుమంచి, నేలకొండపల్లి, సత్తుపల్లి, చింతకాని మండలాలకు చెందిన పలువురు గ్రీవెన్స్ డేలో వినతులు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఆర్‌డీవో విద్యాచందన, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## టెన్త్ ఇంటర్నల్ మార్కుల తనిఖీలకు.. 58 బృందాలు

- ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు తనిఖీలకు షెడ్యూల్ ఖరారు
- రోజుకు మూడు పాఠశాలల్లో పరిశీలనకు కార్యాచరణ
- ఒక హెచ్‌ఎం, ముగ్గురు సబ్జెక్టు నిపుణులతో బృందాలు



ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 29 : పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల తనిఖీకి విద్యాశాఖ అధికారులు ప్రత్యేక బృందాలను నియమించారు. సబ్జెక్టు మార్కులు 100 కాగా.. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ విధానంలో 20 మార్కులకు పరీక్షలు నిర్వహించి వాటి ఆధారంగా విద్యార్థికి మార్కులు కేటాయిస్తారు. వార్షిక పరీక్షల్లో 80 మార్కులకు ప్రశ్నపత్రాన్ని అందజేస్తారు. 20 మార్కులను పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులే మూల్యాంకనం చేసి కేటాయిస్తారు. ఈ మార్కులు, సమాధాన పత్రాలను పరిశీలించి పాఠశాలలు సక్రమంగా మార్కులు నమోదు చేశాయా? లేదా? అనే అంశంపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలు జిల్లాలో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లోనూ జరుగుతాయి.

**సబ్జెక్టు నిపుణుల కేటాయింపు..**

తనిఖీలకు వెళ్లిన అధికారుల బృందంలో ముగ్గురు సబ్జెక్టు నిపుణులు ఉంటారు. వీరు ఆయా సబ్జెక్టుల ఆధారంగా ప్రతి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన ఇంటర్నల్ మార్కులను పరిశీలిస్తారు. సంబంధిత మార్కుల ప్రోఫార్మాను పోల్చుతూ విద్యార్థి రాసిన సమాధానపత్రాలు సరిగ్గా ఉన్నాయో.. లేదో.. సరిచూస్తారు. దీంతోపాటు విద్యార్థి రాసిన సమాధానాలకు ఉపాధ్యాయులు సరిగ్గా మార్కులు వేశారా? ఏమైనా తప్పులు దొర్లాయా? ఇతరాలేమైనా ప్రభావం చూపాయా? అనే కోణంలోనూ పరిశీలిస్తారు. విద్యార్థి హాజరు పట్టికలు, ప్రాజెక్ట్ రిపోర్టులను పరిశీలిస్తారు. సబ్జెక్టు నిపుణులు పరిశీలించిన వాటిలో హెచ్చు తగ్గులు ఉంటే సంబంధిత బృంద నాయకుడికి వివరిస్తారు. తనిఖీల్లో లోపాలుంటే ఆ నివేదికను సంబంధిత తనిఖీ కన్వీనర్ డీసీఈబీ సెక్రటరీ ద్వారా డీఈవోకి అందజేస్తారు.

**ఎంఈవోల పర్యవేక్షణ..**

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల తనిఖీలను మండల విద్యాశాఖాధికారులు సమన్వయం చేయనున్నారు. ఎంఈవోలు సూచించిన విధంగా ఆయా బృందాలు పాఠశాలల్లో తనిఖీలు చేయనున్నాయి. యాజమాన్యాలవారీగా ఎయిడెడ్, బీసీ వెల్ఫేర్, ప్రభుత్వ, ఐటీడీఏ, కేజీబీవీలు, టీఎస్ఎంఎస్, ప్రైవేట్, టీఎస్ఆర్ఎస్, టీఎస్‌డబ్ల్యూఈఎస్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో కలిపి జిల్లాలో మొత్తం 16,514 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు రోజుకు రెండు లేదా మూడు స్కూళ్ల చొప్పున 423 పాఠశాలల్లో తనిఖీలు చేయనున్నారు. బృందాలకు అనుగుణంగా ఒక్కో టీముకు 10 నుంచి 13 వరకు స్కూళ్లను కేటాయించారు. ఒకే ప్రాంతంలో ఉండి.. దగ్గరగా ఉన్న స్కూళ్లయితే రోజుకు మూడు చేసేలా సూచనలు చేశారు.

### తేడాలుంటే చర్యలు..



సమాధానపత్రాల్లో మార్కులను నిశితంగా పరిశీలించాలి. విద్యార్థి సరిగ్గా సమాధానాలు రాయకపోయినా అత్యధిక మార్కులు కేటాయిస్తే సంబంధిత బాధ్యులపై చర్యలుంటాయి. సమాధాన పత్రాల పరిశీలనలో ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలో తనిఖీలకు వెళ్లే బృందాలకు వివరించాం. ప్రతి పాఠశాలలో తనిఖీ చేసే సమయంలో అన్ని అంశాలను వారికి అందజేసిన పత్రాల్లో నమోదు చేస్తారు. తనిఖీ చేసే బృందాలను ఎంఈవోలు మార్గదర్శనం చేస్తుంటారు.

**–సోమశేఖర శర్మ, డీఈవో, ఖమ్మం**

### బృందాల్లో సబ్జెక్టు నిపుణులు..



పదో తరగతి ఇంటర్నల్ మార్కుల తనిఖీల్లో మండల విద్యాశాఖాధికారుల సహాయంతో సబ్జెక్టు నిపుణులను నియమించారు. ప్రతి బృందానికీ సీనియర్ ప్రధానోపాధ్యాయుడు ఉంటారు. తనిఖీల వివరాలను ప్రతి రోజూ డీఈవోకి నివేదిస్తాం. మండల విద్యాశాఖాధికారులు ఆయా మండలాల్లో పాఠశాలలను ఆయా బృందాలకు కేటాయిస్తారు.

**–నారాయణ, సెక్రటరీ, డీసీఈబీ**

### 58 బృందాలు..

ఇంటర్నల్ మార్కుల తనిఖీలకు నిపుణులైన ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఇంటర్నల్ మార్కుల ప్రక్రియలో పాల్గొనేందుకు ఖమ్మంలో 58 బృందాలను నియమించారు. ప్రతి బృందానికి ఒక సీనియర్ ప్రధానోపాధ్యాయుడు నాయకత్వం వహిస్తారు. అతడి ఆధ్వర్యంలో ప్రతి బృందానికీ ముగ్గురు సబ్జెక్టు నిపుణులను నియమించారు. తెలుగు, హిందీ సబ్జెక్టులకు ఒకరు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులకు మరొకరు, సోషల్, సైన్స్ సబ్జెక్టులకు ఇంకొకరు చొప్పున ఉంటారు. వీరికి కేటాయించిన సబ్జెక్టుల ఆధారంగా పాఠశాలల్లో తనిఖీలు చేస్తారు. తనిఖీలు ఎలా చేయాలి? ఏయే అంశాలు ప్రాతిపదికగా ఉండాలి? అనే వాటిపై మండలస్థాయి సమావేశంలో నిర్ణయించారు. తనిఖీల సమయంలో సందేహాలు, విధుల సమాచారం వంటి వివరాలను డీసీఈబీ సెక్రటరీ నారాయణకు అందజేస్తారు.

## కొత్త మోడళ్లు.. సరికొత్త వాహనాలు..

- నూతన మోడళ్లతో రూపుదిద్దుకుంటున్న కార్లు, బైక్‌లు
- ట్రెండ్‌కు తగినట్లుగా మార్కెట్‌లోకి తెస్తున్న కంపెనీలు
- షోరూంలలో ఆకట్టుకుంటున్న సరికొత్త వాహనాలు



రఘునాథపాలెం, జనవరి 29 : ఆటో రం గంలో తీరొక్క వాహనాలు సాక్షాత్కరిస్తున్నాయి. కంపెనీ ఏదైనా సరే.. మోడళ్లకు కొదవ లేదు. మారుతున్న ట్రెండ్‌కు తగినట్లుగా, యూత్‌ను ఆకట్టుకునే విధంగా బైక్‌లు, కార్లు మార్కెట్‌లోకి వస్తున్నాయి. యువత మనసును దోచేలా ఆకర్షణీయ రంగుల్లో.. అభిరుచికి తగినట్లుగా నూతన మోడళ్లతో రూపుదిద్దుకొని మన కళ్లముందు ప్రత్యక్షమవుతున్నాయి. ఇక కార్ల గురించైతే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పుడొచ్చే నూతన మోడల్ కార్లలో ప్రయాణం స్వర్గాన్ని తలపిస్తుందనేలా ఉంటున్నాయి. కారు స్టార్ట్ చేసి దూరపు ప్రయాణం మొదలు పెడితే.. అప్పుడే గమ్యం చేరిపోయామా అనే ఆశ్చర్యాన్ని కలిగించేలా ఉంటున్నాయి. బైక్‌ల విషయానికొస్తే.. రోడ్డెక్కితే రయ్‌రయ్ అంటూ క్షణాల్లో కావాల్సినంత వేగంతో ప్రయాణించేలా అందుబాటులోకి వచ్చాయి. వాహనాలను తయారు చేసే దిగ్గజ ఆటోరంగ సంస్థలన్నీ పోటీ పడి కస్టమర్లు మెచ్చేలా సాంకేతికతను జోడించి తయారు చేస్తున్నాయి. టీవీఎస్, సుజుకీ, హీరో, హోండా, బజాజ్ వంటి బైక్‌ల కంపెనీలు, హ్యుందాయ్, మహీంద్రా, కియా వంటి అనేక దిగ్గజ కార్ల కంపెనీలు ఏటికేడాది పోటీలు పడుతూ సరికొత్త వెర్షన్లను అందుబాటులోకి తెస్తున్నాయి. కొత్త మోడళ్లతో సరికొత్తగా వాహనాలు మార్కెట్లోకి రావడంతో డిమాండ్ సైతం అదే రీతిలో ఉంటోంది. కొన్ని సమయాల్లో నచ్చిన వాహనం కావాలంటే ముందుగా బుక్ చేసుకొని నెలలతరబడి వేచి చూడాల్సిన పరిస్థితి కూడా ఉంటోంది. అలా వాహనాలకు డిమాండ్ కూడా పెరిగిపోతోంది. మైలేజీతో ఆకట్టుకునే కార్లు, బైక్‌లు సైతం మార్కెట్‌లో అనేకం ఉంటున్నాయి. మైలేజ్‌ను చూసి కొనుగోలు చేసే వారు కొందరైతే.. వాహనాన్ని క్రేజీగా వినియోగించుకునేందుకు మైలేజీతో సంబంధం లేకుండా కొనుగోలు చేసేవారు మరికొందరు. ఇలా భిన్న అభిరుచులకు తగినట్లుగా విభిన్న మోడళ్ల వాహనాలు రహదారులపై కన్పిస్తున్నాయి.

### సరికొత్త మోడళ్లకు వేదికగా వజ్ర టీవీఎస్



వజ్ర టీవీఎస్ సంస్థ కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నది. ప్రస్తుతం షోరూంలో టీవీఎస్ ఎక్సెల్, జుపిటర్, రైడర్, అపాచీ, ఎంటార్క్, స్టార్ సిటీ రేడియాన్ వంటి 11 వెరైటీలతో వాహనాలు అందుబాటులో ఉన్నాయి. వాహనాల కొనుగోలుకు ఆసక్తి చూపే వారికోసం డిస్కౌంట్ సౌకర్యం కల్పిస్తున్నాం. మా సంస్థ తయారు చేసే వాహనాలు వాహనదారులు మెచ్చేలా ఉంటాయి.

**– దినేశ్‌కుమార్, షోరూం మేనేజింగ్ డైరెక్టర్, ఖమ్మం**

### కార్ల తయారీకి కాకతీయ టయోటా పెట్టింది పేరు..



కార్ల తయారీకి కాకతీయ టయోటా పెట్టింది పేరుగా నిలుస్తోంది. సంస్థ 11 మోడల్స్‌తో సాంకేతికతను జోడించి సరికొత్తగా తయారు చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్లాంజా, రూమియన్, హైరైడర్, ఇన్నోవా క్రిస్టా, హైక్రాస్, ఫార్చునర్, కామరీ, హైలక్స్, వెల్‌ఫైర్, ఎల్‌సీ–300 మోడళ్లు ప్రస్తుతం మా షోరూంలో విభిన్న రంగుల్లో ఉన్నాయి. పలు రకాల కార్లపై ప్రత్యేక డిస్కౌంట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం.

**– అమరేందర్, కాకతీయ టయోటా జీఎం, ఖమ్మం**

### నిత్యం సరికొత్త వాహనాలు వస్తున్నాయి..



సరికొత్త ఫీచర్లతో కూడిన వాహనాలు నిత్యం మార్కెట్లోకి వస్తూనే ఉన్నాయి. వాటి రిజిస్ట్రేషన్ నిమిత్తం అవన్నీ మా కార్యాలయానికి రోజూ వస్తూనే ఉంటాయి. వాహనదారుల అభిరుచులకు అనుగుణంగా కొత్త కొత్త మోడళ్లతో కంపెనీలు వాహనాలను తయారు చేస్తున్నాయి. సీసీకి తగినట్లుగా ఆటోరంగ సంస్థలు కార్లు, బైక్‌లను ఏటికేడాది నూతన సాంకేతిక విధానంతో తయారు చేస్తున్నాయి.

**–మహ్మద్ గౌస్ పాషా, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, ఖమ్మం**

## అశ్వారావుపేటను హార్టికల్చర్ హబ్‌గా మార్చాలి

- ‘పేట’ వ్యవసాయ కళాశాలలోనూ హార్టికల్చర్ కోర్సులు
- పవర్ ప్లాంట్ పరిశీలనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రెండో ఫ్యాక్టరీ నిర్మాణ ప్రాముఖ్యతను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వివరిస్తున్న ఆయిల్‌ఫెడ్ అధికారులు



మంత్రి తుమ్మలకు మొక్కను అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

అశ్వారావుపేట, జనవరి 29: అశ్వారావుపేటను హార్టికల్చర్ హబ్‌గా మార్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సోమవారం ఆయన ఆయిల్‌ఫెడ్ అధికారులతో కలిసి అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో నిర్మిస్తున్న పవర్ ప్లాంట్‌ను పరిశీలించి మాట్లాడారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా పామాయిల్ ఫ్యాక్టరీలో రూ.30 కోట్లతో పవర్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఫ్యాక్టరీకి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉండొద్దనే ఉద్దేశంతో ప్లాంట్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఇక్కడి భూములు ఉద్యాన పంటలకు అనుకూలమని శాస్త్రవేత్తలు గతంలోనే ప్రకటించారని గుర్తుచేశారు. రైతులు ఆర్థికంగా నిలబడాలంటే ఒకే వ్యవసాయ క్షేత్రంలో మూడు, నాలుగు రకాల పంటలను సాగు చేయాలని సూచించారు. తద్వారా ఒక పంట ద్వారా నష్టం వాటిల్లినా, ఇతర పంటల ద్వారా ఆర్థిక భరోసా వస్తుందన్నారు. ఉద్యాన తోటల్లో అంతర పంటలుగా కోకో, వక్క, జాజీ సాగు చేయవచ్చన్నారు. అంతర పంటలు సాగు చేసే రైతులను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని భరోసానిచ్చారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలోనూ ఉద్యాన కోర్సులు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అగ్రికల్చర్ యూనివర్సిటీకి కొత్త వీసీని నియమించిన తర్వాత ఆ పని మొదలు పెడతామన్నారు. వీసీని అశ్వారావుపేటకు ఆహ్వానిస్తామన్నారు. మంత్రి వెంట ఆయిల్ ఫాం రైతుల సంఘం నాయకులు ఆలపాటి రామ్మోహనరావు, రామచంద్ర ప్రసాద్, బండి భాస్కర్, బత్తిన పార్థసారథి, నార్లపాటి రాములు ఉన్నారు.

**అప్పారావుపేట ఫ్యాక్టరీ సందర్శన..**

దమ్మపేట రూరల్, జనవరి 29: దమ్మపేట మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని సోమవారం తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. పామాయిల్ ఉప ఉత్పత్తుల (వ్యర్థాలు) ద్వారా లాభాలనూ రైతులకు ఇవ్వాలని టీఎస్ ఆయిల్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యం 60 టన్నుల నుంచి 90 టన్నులకు పెరిగిందని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి వివరించారు. అనంతరం మంత్రి ఫ్యాక్టరీలో కలియదిరిగారు. పలు విభాగాలను సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. పర్యటనలో ఆయిల్‌ఫెడ్ డివిజినల్ మేనేజర్ బాలకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్ ఉన్నారు.

**ఫ్యాక్టరీ సందర్శనకు రాని ఎమ్మెల్యే జారే..**

అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ సందర్శనకు వచ్చిన మంత్రి తుమ్మల వెంట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ లేకపోవడం గమనార్హం. ఎమ్మెల్యే స్థానికంగానే ఉండి కూడా మంత్రి వద్దకు రాకపోవడం స్థానికంగా చర్చనీయాశమైంది. పర్యటన తర్వాత ఎమ్మెల్యే గండుగులపల్లిలోని మంత్రి నివాసంలో మంత్రి తుమ్మలను కలిశారు. దీనిలో ఏం మతలబు ఉన్నదో తెలియదని స్థానికులు భావిస్తున్నారు.

**మంత్రిని కలిసిన ఎస్పీ**

భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు సోమవారం గండుగులపల్లిలోని మంత్రి నివాసంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. పలు అంశాలపై పరస్పరం చర్చించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానిది కక్షసాధింపు చర్య

- ఆ పార్టీ ఉడత ఊపులకు భయపడే ప్రసక్తి లేదు
- పగడాల నాగరాజుకు బీఆర్‌ఎస్ అండగా ఉంది
- ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు
- జిల్లా జైల్లో నగరాధ్యక్షుడికి బీఆర్‌ఎస్ నేతల పరామర్శ



నాగరాజును పరామర్శించి బయటకు వస్తున్న తాతా మధు, బీఆర్‌ఎస్ నాయకులు

ఖమ్మం రూరల్, జనవరి 29: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత పరిపాలనను పక్కనబెట్టి రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు ఆరోపించారు. ఆ పార్టీ ఉడత ఊపులకు భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. జిల్లా జైల్లో ఉన్న బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజును తాతా మధు సహా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సోమవారం ములాఖత్ ద్వారా కలిశారు. ఈ సందర్భంగా అతడిని పరామర్శించి జరిగిన ఘటన గురించి, అనంతరం దారితీసిన పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. జైలు బయటకు వచ్చిన తరువాత పార్టీ ముఖ్య నాయకులతో కలిసి తాతా మధు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు కక్షసాధింపులకు పాల్పడుతున్నారని, అదే టార్గెట్‌తో బీఆర్‌ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ అంటేనే ఉద్యమ పార్టీ అని, ఏళ్ల తరబడి పోరాటం చేసిన ఘనత తమ పార్టీకి ఉందని గుర్తుచేశారు. గతంతో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తాము కక్షసాధింపులకు పాల్పడుతున్నామంటూ అప్పట్లో కాంగ్రెస్ నాయకులు ఆరోపించేవారని అన్నారు. మరి అలా అనుకుంటే ఇప్పుడు కాంగ్రెస్ నేతలు చేస్తున్నది ఏంటని ప్రశ్నించారు. ఇందుకు జిల్లాలోని ముగ్గురు మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా ప్రవర్తిస్తున్న కాంగ్రెస్‌కు రాబోయే రోజుల్లో ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు భయపడేదిలేదని అన్నారు. ఉద్యమాలకు పుట్టినిల్లయిన బీఆర్‌ఎస్.. ఏనాడూ అవకాశవాద రాజకీయాలు చేయలేదని అన్నారు. పగడాల నాగరాజు అరెస్టుతో ఏమో చేస్తామని అనుకోవడం హాస్యాస్పదమేనని అన్నారు. ప్రభుత్వంలోకి వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లాలో చేస్తున్న అవకాశవాద రాజకీయాలను కొద్దిరోజుల్లోనే జిల్లా ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, బీఆర్‌ఎస్ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు గుండాల (ఆర్జేసీ) కృష్ణ, కూరాకుల వలరాజు, వీరూనాయక్, బెల్లం వేణుగోపాల్, బీ.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టండి

### భద్రాది కలెక్టర్ ప్రియాంక ఆల



ప్రజావాణిలో విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణిలో బాధితులు ఇచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి.. వాటి పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దరఖాస్తుదారులను వివరాలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నవభారత్ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ స్కూల్‌లో నెలకొన్న సమస్యలపై, పాల్వంచ మండలం బసవతారకం కాలనీకి చెందిన లలిత, చర్ల మండలం కుదునూరుకు చెందిన ఎస్.రజిని దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీఆర్వో రవీంద్రనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


